ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జనగామ
శనివారం 22 జూన్ 2024

యోగాతో ఆరోగ్యం


జనగామ సీజేఐటీలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రాధాన్యాన్ని వివరించిన వక్తలు
- ఘనంగా నిర్వహించిన విద్యాలయాలు
- అవగాహన కల్పించిన శిక్షకులు


జిల్లా కోర్టులో యోగాసనాలు వేస్తున్న జడ్జి రవీంద్రశర్మ

జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాలయాలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల్లో యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు శిక్షకులు, గురువులు మాట్లాడుతూ మానసిక, శారీరక, ఆధ్యాత్మిక దృఢత్వానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనేదే యోగా ఉద్దేశమన్నారు. ప్రాచీన భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను ఐక్యరాజ్య సమితి గుర్తించి ప్రపంచవ్యాప్తం చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, శారీరక, మానసిక ఒత్తిడిని దూరం చేస్తుందని అన్నారు. జనగామ వేద ఆయుర్వేదిక్ పంచకర్మ వెల్‌నెస్ సెంటర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మెడ, నడుము, కీళ్లనొప్పులు, చర్మ సంబంధిత, సైనస్ మొదలగు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

- జనగామ కల్చరల్



ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

వివరాలు 6లో...



- పాత స్థానాల్లోకి మళ్లీ వచ్చేందుకు పలువురి ఆసక్తి
- ప్రస్తుత స్టేషన్లలోనే కొనసాగాలి అనుకుంటున్న కొందరు..
- పైరవీల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- ఎస్ఐ నుంచి ఏసీపీల వరకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- పోస్టింగుకో రేటు ఫిక్స్..
- నగర శివారుల్లోని స్టేషన్లకు ఫుల్ డిమాండ్
- సిఫారసు లేఖ లేకుంటే ఎంత
- సిన్సియర్‌గా జాబ్ చేసినా లూప్ లైన్‌కేనని చర్చ

ఎన్నికల కోడ్ ముగియటంతో పైరవీలు మొదలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఖాకీలకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. ఎన్నికల కోడ్ ముగియడంతో తమను ఎక్కడికి బదిలీ చేస్తారో అనే ఆందోళనలో పోలీసుల్లో కనిపిస్తోంది. దీంతో పోస్టింగ్ లకు సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణ లు చేస్తున్నారు. మంచి చోట పోస్టింగ్ ఇస్తే అదే స్థాయిలో భారీగా నజరానా ఇచ్చేందుకు సిద్ధమవు తున్నారు. ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు తాము కోరుకున్న పోస్టింగ్‌ల ఇప్పించేలా పైరవీ చేయా లంటూ తిరుగుతున్నారు. అయితే ఎన్నికలకు ముందు పైరవీలతో పోస్టింగ్ కొట్టిన కొందరు ఖాకీలు మూడు రోజులు తిరగక ముందే ఎన్నికల కోడ్ పేరుతో బదిలీ అయ్యారు. వారిలో చాలామంది నాటి తమ పోస్టులు తమకే తిరిగి ఇవ్వాలని నేతలపై ఒత్తిడి తెస్తుండగా, ప్రస్తుతం డ్యూటీలు నిర్వహిస్తున్న అధికారులు ఇక్కడే కొనసాగేలా అదేస్థాయిలో నేతలపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో నేతలు ఎవరికి సిఫార్సు లేఖలు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లతో బదిలీలు షురూ..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రభుత్వం ఎన్నికల ముందు జిల్లాలో మూడేళ్లకు పైగా పని చేసిన వారిని, సొంత జిల్లాలో పని చేసినవారిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసింది. వారి స్థానంలో కొత్త అధి కారులను నియమించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టింది. ప్రధానంగా గత ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలను బదిలీలు చేసింది. ఇందులో భాగంగా దీంతో ఈ నెల 15వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లను బదిలీ చేసింది. వరంగల్ వెస్ట్ (జనగామ), వరంగల్ సెంట్రల్ డీసీపీలకు కూడా స్థానం చలనం జరిగింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టడంతో తరువాత కింది స్థాయి అధికారుల బదిలీలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా ఎస్ఐ, సీఐ, డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టిసారించారు. దీంతో రెండుమూడు రోజుల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

దళారుల రంగ ప్రవేశం..!

బదిలీల పర్వం మొదలు కాటంతో మంచి పోస్టింగ్ కోసం నేతల చుట్టు ఖాకీలు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు, నేతలు ఖాకీల పనితీరు కంటే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది. సామాజిక వర్గం అధికారులు లేకుంటే సమర్థత, విశ్వస నీయత, పనితీరు, పాత పరిచయాలు తదితర అంశాలను బేరీజు వేసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలో ఇచ్చే పోస్టిం గుల్లో ఎక్కువ శాతం తమ సామాజిక వర్గానికి చెందిన అధికారులకే సిఫార్సులు చేస్తున్నారనే చర్చ జరుగు తుండగా మరికొన్ని చోట్ల మాత్రం పోస్టింగుకో రేటు ఫిక్స్ చేసి దళారులతో బేరసా రలకు కొంతమంది నేతలు దిగుతున్నారనే ప్రచారం ఉంది. వరంగల్ నగరం సమీపంలోని ఓ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పోలీస్‌స్టేషన్లకు భారీగా ధర పలుకుతుందనే చర్చ పోలీసు వర్గా ల్లో జోరుగా సాగుతోంది. నగరం నడిబొడ్డున ఉన్న ఓ ఏసీపీ పోస్టింగ్ కోసం పొరుగు జిల్లా మంత్రితో ఓ అధికారి పైరవీలు చేస్తున్నారనే చర్చ జరు గుతుండగా.. పరకాల నియోజకవర్గం పరిధిలో రెం డు స్టేషన్లలో పోస్టింగుల విషయంలోనూ ముగ్గు రు నేతలు వేర్వేరుగా సిఫార్సులు చేస్తున్నారని సమాచారం. నగర పరిధిలో ఉండే నాలుగైదు పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్ కోసం భారీగా క్యూ కడుతున్నారని తెలుస్తోంది.

మా కుర్చీ మాకే కావాలి..

పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి నెలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీగా పోలీసు లు బదిలీలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభు త్వం కొత్తగా ఏర్పడటంతో ఎమ్మెల్యేలు, కీలక నేతలు సూచించిన వారికి పోస్టింగులు దక్కా యి. ఆ సమయంలో కొందరు నేతలు భారీగా కక్కుర్తి పడి పోస్టింగులు ఇప్పించినట్టు ప్రచారం జరిగింది. కొన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌వోల పోస్టింగులకు రూ.20 లక్షల నుంచి రూ.25లక్షల వరకు చేతులు మారిన ట్లు అప్పట్లో గుసగుసలు వినిపించాయి. అయితే ఫిబ్రవరిలో విధుల్లో చేరిన కొంతమంది అధికా రులకు మార్చిలో జరిగిన బదిలీల్లో స్థానచలనం తప్పలేదు. అప్పటికే సిఫార్సు లేఖల కోసం భారీ గా సమర్పించుకున్న వారు ఇతర ప్రాంతాలకు వె ళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం కోడ్ ముగియటంతో పోస్టింగులు ఇస్తుండటంతో మళ్లీ తమ పాత స్థా నాలు తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు సమా చారం. అ యితే ఆ పోస్టు ఆ సిఫార్సు లేఖ వరకే అని.. మళ్లీ పోస్టు కావాలంటే ఆలోచిస్తామంటూ వరం గల్ నగర సమీపంలోని ఓ నేత ఖాకీలను ఇంటి చుట్టూ తిప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగు తోంది. అంతేకాకుండా వేరే అధికారులకు పోస్టింగు లు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దళారులు రంగంలోకి దిగి బేరసారాలు మొదలు పెట్టి నటు గా కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో తమ పాత పోస్టింగ్ వస్తుందా..లేదా అనే టెన్షన్‌లో కొందరు పోలీసులు ఉండగా, ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు కూడా అదే స్టేషన్‌లో ఉండేందుకు చేయాల్సిన ప్రయత్నాలు చేస్తున్నారట. తనకున్న పరిచయాలతో ఆయా ఏరియాల్లోని కీలక నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఒకే స్టేషన్‌పై ఎన్నికల్లో బదిలీ అయినా అధికారితో పాటు ఎన్నిల్లో బదిలీపై వచ్చిన అధికారి, కొత్తగా సిఫార్సు కోసం ప్రయత్నం చేస్తున్న అధికారితో కలిసి ట్రైయంగిల్ ఫైట్‌లో కుర్చీ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఖాకీల్లో నెలకొంది.



సిఫారసు లేకుంటే లూప్‌లైన్‌లోకే..

పోలీసు శాఖలో నిజాయితీగా పని చేసే కొంతమంది అధికా రులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పటం లేదు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడుస్తున్నా యనే ఆరోపణలు న్నాయి. అన్ని శాఖల కంటే పోలీస్ శాఖలోనే అధికంగా బదిలీలపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయనే అభిప్రా యాలు ఉన్నాయి. దీంతో నిజాయితీగా విధులు నిర్వహించే కొంతమంది అధికారు లు, పైరవీలు చేయ టం ఇష్టం లేని అధికా రులకు లూప్ లైన్ డ్యూటీలు తప్పవనే చర్చ జరుగుతోంది. అనేక మంది పోలీసు అధికారులు నిజాయి తీగా పని చేసినా, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్ లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొందరు పోలీసుల నుంచి వినిపిస్తోంది.

జయశంకర్ ఆశయసాధనకు కృషి చేయాలి

వర్ధంతి సభలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య


స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

వివరాలు 6వ పేజీలో..

'సార్' వర్ధంతిని విస్మరించారు..!

జనగామ కల్చరల్, జూన్ 21: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని జనగామ పట్టణ ప్రజలు, నాయకులు విస్మరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయ్యేసరికి జయశంకర్ సార్ వర్ధంతి నిర్వహించాలన్న విషయాన్ని మర్చిపోయారు. పూర్తిస్థాయిలో యోగా దినోత్సవంపైనే దృష్టి సారించిన నాయకులు 'సార్'కు నివాళి అర్పించాలన్న విషయాన్ని పట్టించుకోకపోవడం విచారకరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాలయాలు, కలెక్టరేట్‌లోనూ సార్ వర్ధంతిని నిర్వహించలేదు. అన్ని రాజకీయ పార్టీలు, ఇతర సంఘాల నాయకులు సైతం ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదు. కేవలం వాట్సాప్‌లో ఫొటోలు షేర్‌చేయడానికే పరిమితమయ్యారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ కల్చరల్, జూన్ 21: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన కలెక్టరేట్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో పాఠశాలల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాలను ఎంఈవోలు, ఎంఎన్‌వోలు సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన అభివృద్ధి పనులను పరిశీలించాలన్నారు. మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల పట్ల నమ్మకం పెంచేవిధంగా పని చేయాలన్నారు. విద్యార్థులకు 100 శాతం తాగునీటి సరఫరా అందించాలని, త్రీఫేస్ విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, వసతి గృహాల్లోనూ మూత్రశాలలు, కిచెన్ షెడ్లులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఫెన్సింగ్, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ తదితర పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ బడిలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మందులు సరిపడా అందుబాటు లో ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, రిజిస్టర్లను తగిన విధంగా నిర్వహించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. సంవత్సరానికోసారి విద్యార్థులకు సాంస్కృతిక, సాహిత్యపరమైన ఆటలు, క్రీడా కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల జ్ఞాపకశక్తి మెరుగయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మండలానికో పాఠశాలను ఎంపిక చేసి ఉత్తమ పురస్కారాలు అందజేస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.25 లక్షలు, రెండో బహుమతిగా రూ.15 లక్షలు, మూడో బహుమతిగా రూ.10 లక్షల నగదు అందిస్తామని, ఆ నగదును పాఠశాల అభివృద్ధికి ఉపయోగించాలని అన్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా మండలానికో ఉత్తమ ప్రధానోపాధ్యాయులను ఎంపిక చేసి, పురస్కారాలు అందించి వారికి రూ.50 వేలను నగదు బహుమతిగా అందజేస్తామన్నారు. ప్రతీ మండలం నుంచి ఒక్కో పాఠశాలను ఎంపిక చేసి ఆ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారికి రూ.50 వేల నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మొత్తం 67 బడులను మనఊరు మనబడి కింద గుర్తించామని, వాటిలో 40 ప్రాథమిక పాఠశాలలు, 27 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 121 పాఠశాలలను గుర్తించగా వాటిలో 88 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. సమావేశంలో డీఈవో కె.రాము, మండలాల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

'నీట్' మళ్లీ నిర్వహించాలి

సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


జనగామలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

జనగామ రూరల్ జూన్ 21: వైద్యవిద్యకు సంబంధించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్)ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ఆదిసాయన్న మాట్లాడుతూ మే 5న జరిగిన పరీక్ష పేపర్ లీకేజీతో విద్యార్థుల జీవితాలు రోడ్డున పడ్డాయని విమర్శించారు. ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. వెంటనే సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంగళంపల్లి జనార్ధన్, సొప్పరి సోమయ్య, నగేష్, వెంకట్రాది, నాగరాజు, ఆదిలక్ష్మీ, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి..

దేవరుప్పుల: నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు డి. సుమ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె దేవరుప్పులలో మాట్లాడుతూ పేపర్ లీకేజీతో విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. దేశంలో అతి ప్రాముఖ్యమైన పరీక్షల నిర్వహణపై కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించలేని ఎన్‌టీఏ సంస్థను తక్షణమే రద్దుచేసి పరీక్షలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జనగామ సీఐపై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

జనగామ రూరల్, జూన్ 21: తనపై తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ జనగామ సీఐ రఘుపతిరెడ్డిపై జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన ఈర్ల అనిల్ శుక్రవారం హైదరాబాద్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ గతంలో తనపై గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారని, దీనిపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ పట్టించుకోలేదని అన్నారు. తనపై దాడి చేసిన వారికి వత్తాసు పలుకుతూ తనపై తప్పుడు కేసు నమోదు చేశారని వాపోయారు. ఈ మేరకు సీఐపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషన్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు.

భూపోరాట నాయకుడు సోమయ్య మృతి

పాలకుర్తి, జూన్ 21: మండలంలోని మంచుప్పుల గ్రామానికి చెందిన భూపోరాట యోధుడు కాకర్ల సోమయ్య(65) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. సీపీఎం మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య, జిల్లా నాయకుడు సోమ సత్యం హాజరై ఎర్రజెండాతో నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దళితులకు కేటాయించిన భూమిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇండ్లను అర్హులైన దళితులకు మాత్రమే ఇవ్వాలని సోమయ్య పోరాటం చేశాడని గుర్తు చేశారు. ఆయనతో పాటు నాయకులు మాసంపల్లి నాగయ్య, మోత్కుపల్లి భిక్షపతి, బాణాల నందు, గోగుల సోమనర్సయ్య, పద్మ, ఐలయ్య యాకన్న, సోమక్క నివాళి అర్పించారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం..

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను నిర్మూలించి జలాశయాలను కాపాడుకుందాం
- పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్



ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 21: మట్టి విగ్రహాలను పూజిద్దాం.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిర్మూలించి జలాశయాలను కాపాడుకుందాం.. అని కాజీపేటకు చెందిన పర్యావరణ రక్షకుడు కొలిపాక ప్రకాశ్ పిలుపునిచ్చారు. హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు ఆయన చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ఘన్‌పూర్‌కు చేరుకుంది. ఇక్కడ ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలను జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై ప్రజలు రోగాలబారిన పడుతున్నారని, అందువల్ల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతేగాకుండా చెరువులు, కుంటల్లో ఉండే జలచరాలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆ చేపలు తిన్న మనుషులకు శ్వాసకోశ, నాడీ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానికులు కొలిపాక రవి, వేణు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల చైతన్యంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు



అదనపు గదుల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జూన్ 21: గ్రామస్థుల చైతన్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయనడానికి ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలే నిదర్శనమని, ఆదిశగా గ్రామాల్లో పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ నిధులు రూ.18 లక్షలతో నిర్మించనున్న ఆదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మూతపడిన పాఠశాలను గ్రామస్థులు చైతన్యంతో తెరిపించుకోవడమే కాకుండా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రైవేటు ఉపాధ్యాయులను ఏర్పరుచుకొని మంచి ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ గుర్తింపు పొందిన పాఠశాలను ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండుగా విభజించడంతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు (ఉపాధ్యాయులు) వస్తారని, అందుకు తనవంతుగా ప్రభుత్వం దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పాఠశాల పనితీరు అద్భుతంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆదర్శవంతమైన ఈ పాఠశాలలో మౌలిక వసతులకై తన సీడీఎఫ్ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, నోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం రత్నకుమార్ అధ్యక్షత వహించగా తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కడుదూరి రాజు, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ సకీన, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పొన్నాల రాజు, నాయకులు సమ్మెట మహేందర్, ఎలిషా, గిరుక రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుంజేడు శ్రీ ముసలమ్మ గుడి ఆవరణలో భక్తుల కోలాహలం

గుంజేడు శ్రీముసలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కొత్తగూడ, జూన్ 21: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేముందు రైతులు శ్రీముసలమ్మ దేవతను దర్శించుకోని పంటలు బాగా పండాలని మొక్కుకోవడం, వాగు నీటిని తీసుకువెళ్లి వ్యవసాయ భూముల్లో చల్లుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగా రైతుల కుటుంబాలు అధిక సంఖ్యలో ముసలమ్మ జాతరకు తరలివచ్చారు. కుటుంబసమేతంగా ముసలమ్మ దేవతను దర్శించుకున్నారు. దీంతోపాటు పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కుటుంబాలు, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కుటుంబాలు శ్రీముసలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలు తీసుకున్న భక్తులు గుడి వద్ద వాహన పూజలు చేశారు. అనంతరం ఆహ్లాదకరంగా అడవిలో వంట లు చేసుకుని వనభోజనాలు చేశారు. కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపారు.

అధికారుల తప్పులు.. టీచర్లకు తిప్పలు..

ప్రహసనంలా ఉపాధ్యాయుల పదోన్నతులు

గణితంలో నిబంధన తారుమారు

సోషల్ అడిక్వసీలో ఒక పోస్టు గల్లంతు

విద్యార్థులు లేని చోట పీడీలకు స్థానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 21: వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రహసనంలా మారింది. అధికారులు చేసిన తప్పులకు పంతుళ్లకు తిప్పలు తప్పడం లేదు. నిబంధనలు అధిగమించడం.. రోస్టర్‌ల ను తప్పుగా చూపించడం.. విద్యార్థులు తక్కువగా ఉన్న చోట పోస్టులను ఓపెన్ చేయడం లాంటి తదితర పొరపాట్లను అధికారులు చేయడం వల్ల పదోన్నతుల్లో కొంత మంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితోపా టు రోస్టర్ విధానంలో తలెత్తిన సాంకేతిక కారణంతో గురువారం రాత్రి వరకు ప్రభుత్వ విభాగంలోని పీఈటీ లు, స్థానిక సంస్థల విభాగంలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఎంలు, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌ల పదోన్నతుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. జిల్లాలోని విద్యాశాఖాధి కారులు తప్పుడు జాబితాలను రూపొందించడంతోనే పదోన్నతుల్లో కొందరు ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తుంటే ఉన్నతాధికారుల ఆదే శాల మేరకే జాబితాలను రూపొందించామని డీఈవో వాసంతి పేర్కొన్నారు.

గణితంలో నిబంధన తారుమారు

ప్రభుత్వ విభాగంలోని గణితం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో నిబంధనలను అధికారులు తారుమారు చేశారని సంబంధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ విభాగంలో మొత్తం 5 క్లియర్ వేకెన్సీలతో జాబితాను రూపొందించారు. ఇందులో 70 శాతం పదోన్నతులతో, 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఒక్క పోస్టును మాత్రమే పదోన్నతితో భర్తీ చేశారు. 4 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అధికారులు నోటిఫై చేయడంతో నిబంధనలను తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించాల్సి ఉండగా వారికి మొండిచేయి మిగిలింది.

ఎస్సీల పదోన్నతులు

స్థానిక సంస్థల విభాగంలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఎస్సీల విభాగంలో అడిక్వసీ ప్రకారం అధికారులు పదోన్నతులు నిర్వహించలేదని సంబంధిత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిక్వసీ జాబితాలో 9 పోస్టులకు పదోన్నతి కల్పిస్తున్నట్లు జాబితాను రూపొందించిన అధికారులు 8 మందికి మాత్రమే పదోన్నతి కల్పించడంతో మరో ఉపాధ్యాయుడు పదోన్నతి పొందలేకపోయినట్లు వారు ఆరోపిస్తున్నారు. తమకు అడక్వసీ విషయంలో తనకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఓ ఉపాధ్యాయురాలు డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

రోస్టర్ పాయింట్లు తారుమారు

వికలాంగుల రోస్టర్ పాయింట్లలోనూ అధికారులు తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. స్థానిక సంస్థల విభాగంలోని తెలుగు ఎస్ఏ పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్ 6లో వీహెచ్ ఉమెన్‌ను కేటాయించాల్సిన చోట వీహెచ్ మెన్ రోస్టర్‌ను కేటాయించడంతో సదరు మహిళా ఉపాధ్యాయురాలుకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది. ఆ మహిళా ఉపాధ్యాయురాలు డీఈవో కార్యాలయంలో ఈ విషయమై వినతి పత్రం అందజేశారు.

పోస్టులు బ్లాక్

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉన్నతీకరణలోనూ అధికారులు తప్పులో కాలేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉన్న చోట పీడీలు అవసరం ఉండగా అందుకు భిన్నంగా విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో అధికారులు పోస్టులను ఉన్నతీకరణ చేసి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో పోస్టులను బ్లాక్ చేశారు. ఖిలావరంగల్ మండలంలోని పలు పాఠశాలల్లో పీడీలు అవసరం ఉండగా వాటిని బ్లాక్ చేసి వరంగల్ మండల పరిధిలో తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలల్లో పీడీల పోస్టులను ఓపెన్ చేశారు. దీంతో అధికారుల తప్పిదంతో అవసరమున్న పాఠశాలల్లో పీడీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జాబితా

వరంగల్ డీఈవో డి.వాసంతి

పదోన్నతుల ప్రక్రియలో జిల్లాలో రూపొందించిన ప్రతీ జాబితా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రూపొందించాం. నిబంధనల మేరకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ సీనియారిటీ జాబితాలతో పాటు అప్‌గ్రేడ్ చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో పీడీ పోస్టుల విషయంలో జరిగిన పొరపాటును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని సైతం ఉన్నతాధికారులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

అవసరం లేని చోట అప్‌గ్రెడేషన్

అవసరం లేని చోట అధికారులు ఎల్పీల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయుల తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, రెండు తరగతులు మాత్రమే ఉన్న చోట్ల రోస్టర్ విధానం పేరుతో అన్యాయంగా అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయులు విమర్శలు చేస్తున్నారు. వరంగల్ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతుల్లో 15 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా అక్కడ ఎల్పీ పోస్టు అప్‌గ్రేడ్ అవసరం లేకున్నా అధికారులు అనవసరంగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తాం..

అర్హులందరికీ పీఎం కిసాన్ అందేలా చర్యలు

కొత్తకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



కొత్తకొండలో స్వామివారికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

భీమదేవరపల్లి, జూన్ 21: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఎడాపెడా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తోందన్నారు. శుక్రవారం రాత్రి భీమదేవరపల్లి మండలానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చ కులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లించారు. వీరభద్రస్వామికి ప్రత్యేకంగా అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆలయ ఆవరణలో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి సహకరించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అందరూ అభివృద్ధిపై సహకరించుకోవాలన్నారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి పర్యాటక శోభ తీసుకువస్తామన్నారు. ఇందుకు అవసరమయ్యే నిధులను సమీకరిస్తామన్నారు. కొత్తకొండ దేవాలయ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికను రూపొందించాలని ఈవోను కోరారు.

కాగా, రాష్ట్రంలో 2019 తర్వాత వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ పీఎం కిసాన్ యోజన రావడం లేదని విలేకరులు ప్రశ్నించగా, ఈ విషయాన్ని ప్రధాని మోదీ, వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖతో మాట్లాడి విధివిధానాలు రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే భీమదేవరపల్లి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దొంగల కొంరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండెల్లి సదానందంయాదవ్, గోదల సంపత్, బండారి కరుణాకర్, అంబీరు కవిత, ఊసకోయిల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన ఎమ్డీ నజీర్ (47) మార్బుల్ టైల్స్‌లో కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 17న కాజీపేట నుంచి హనుమకొండకు వెళ్తున్న క్రమంలో ఫాతిమా నగర్ వద్ద ఒక లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ లారీతో నజీర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నజీర్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎంలో చేర్పించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నజీర్ భార్య అంజుమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: రాష్ట్రప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తోంది. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకుండా ఉన్నవారు అర్హులు. జూలై 10వ తేదీలోపు tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్ మోహన్ సూచించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లెక్చరర్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ల పోస్టులు తెలుగు, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతోపాటు పీజీటీ ఆంగ్లంలో అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25 వరకు సాయంత్రం 4 గంటల లోపు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 80749 94073లో సంప్రదించాలని కోరారు.

జూలై 1 నుంచి ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 21: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్-2023 వార్షిక పరీక్షలు జూలై 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 3, 5, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూలై 9 నుంచి 14 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని గ్రూపుల వారిగా కేటయించిన సమయంలో పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీపై తుమ్మలను కలిసిన టెస్కాబ్ చైర్మన్



మంత్రి తుమ్మలకు వివరాలను తెలియజేస్తున్న మార్నేని

హనుమకొండ సిటీ, జూన్ 21: రైతుల రుణ మాఫీ అంశం విషయంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. సహకార బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 7,74,833 ఉన్నట్లు మంత్రికి వివరించారు. రైతులకు లబ్ధిచేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే రవీందర్‌రావు, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య, డీసీసీ బ్యాంకుల చైర్మన్లు పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

వడ్డెపల్లి, జూన్ 21: మానవహక్కులపై జాతీయ స్థాయి. అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 11గంటలకు హనుమకొండ ప్రెస్‌క్లబ్ ప్రాంతంలోని ఆదర్శ లా కాలేజీలో నిర్వహించనున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ రాష్ట్రకార్యదర్శి పోలెపాక మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు సంబంధించి న సంస్థ ప్రతినిధులందరూ ఈ అవగాహన సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

హనుమకొండ టౌన్, జూన్21: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసి బాధితులకు శుక్రవారం రాత్రి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ వెల్లడించారు. సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ గౌస్‌పాషా, వీరేందర్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.



సీకేఎం కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా వేడుకలకు హాజరైన విద్యార్థులు, నగరవాసులు

యోగాతో రోజును ప్రారంభించాలి

త్రిదండి చిన్నజీయర్ స్వామి



మాట్లాడుతున్న త్రిదండి చిన్నజీయర్ స్వామి

పోచమ్మమైదాన్, జూన్ 21 : ప్రతీ ఒక్కరు యోగాతోనే తమ రోజును ప్రారంభించాలని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆయన హాజయర్యారు. తొలుత హాజరైన వారితో యోగాసనాలు చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వతహాగా యోగా పై దృష్టి సారించాలన్నారు. నిరంతరం యోగా చేయడం ద్వారా వ్యాధులు దరి చేరవని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, డాక్టర్ మురళీకృష్ణ, తుమ్మ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు తప్పని విద్యుత్ కష్టాలు



ఎక్స్‌రే విభాగం వద్ద రోగులు

వరంగల్ మెడికల్, జూన్ 21: ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చిన రోగులకు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ వార్డులకు విద్యుత్ సరఫరా జరిగితే తప్ప విద్యుత్ ఉండదు. ఎమర్జెన్సీ వార్డుకు జనరేటర్ ద్వారా సరఫరా చేస్తున్నా సకాలంలో సిబ్బంది స్పందించకపోవడంతో అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం ఎంజీఎం క్యాజువాలిటీ విభాగంలోని ఎమర్జెన్సీ ఎక్స్‌రే విభాగంలో సుమారు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. అంతేకాకుండా పలు వార్డులకు సైతం కరెంట్ వస్తు పోతూ ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామంలో పత్తి విత్తనాలు వేయగా వర్షం లేని కారణంగా మొలకెత్తకపోవడంతో నీళ్లు పోస్తున్న రైతు కుటుంబం

చూస్తూ ఉండలేక..

కరుణ చూపని వరుణుడు.. వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు

వర్షాలు ఊరిస్తున్నాయి. అడపాదడపా జల్లులు తప్ప సరైన వానలు లేకపోవడంతో వానాకాలం సాగు పనులు ముందుకు సాగడం లేదు. సాధారణంగా ఏటా జూన్ మొదటి వారంలోనే వర్షాలు ఆరంభమై సమృద్ధిగా కురిసేవి. కానీ, ఈ ఏడాది జూన్ ముగుస్తున్నా ఇంకా సరైన వర్షాలు పడటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేయగా వానలు లేక అవి మొలకెత్తే పరిస్థితి కనిపించడం లేదు. మొలకెత్తినవి కూడా వడబడుతున్నాయి. దీంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకులు, బిందెలతో నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలోని పలుప్రాంతాల్లో శుక్రవారం పలువురు రైతులు ఇలా మొక్కలకు నీరు పోయడం కనిపించింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

జయశంకర్ ఆశయసాధనకు కృషి చేయాలి

వర్ధంతి సభలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 21: తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ 13వ వర్ధంతి సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించిన జయశంకర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని పోరాటం చేసి రాష్ట్రం సాకారంకోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వం జయశంకర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యక్షతన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆకుల కుమార్, బత్తుల రాజన్‌బాబు, మారపల్లి ప్రసాద్, మాచర్ల గణేష్, తాటికొండ సురేష్‌కుమార్, గుండె మల్లేషం, అకారపు అశోక్, రంజిత్, కుంభం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పులలో నివాళి అర్పిస్తున్న ఎంపీపీ బస్వ సావిత్రి

దేవరుప్పుల: తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్‌సార్ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మండలపరిషత్తు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడు తూ తెలంగాణ భావజాల వ్యాప్తికోసం తన జీవితాన్ని అంకితం చేసి స్వరాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన మహనీయులు అని కొనియాడారు.



పాలకుర్తిలో జయశంకర్ వర్ధంతిని నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకుర్తి: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ 13వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మదార్, పాము శ్రీనివాస్, కడుదుల కర్ణకర్‌రెడ్డి, గుగ్గిల్ల యాకయ్య, కమ్మగాని పరమేశ్వర్, పొన్నం యాకయ్య, శ్రీనివాస్, మల్లేష్, నాగరాజు, దిండిగాల వెంకన్న ఉన్నారు.



బచ్చన్నపేటలో జయశంకర్ సార్‌కు నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బచ్చన్నపేట: బచ్చన్నపేటతో పాటు గ్రామాలలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్‌సార్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. బచ్చన్నపేటలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సార్ పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు నిడిగొండ శ్రీనివాస్, మాసపేట రవీందర్‌రెడ్డి, గిద్దెల రమేష్, చెరుకూరి శ్రీనివాస్, మల్లారెడ్డి, జంగిటి నరేష్, బందారం క్రాంతి, గంగరబోయిన మహేందర్, కనుకయ్య, కర్ణాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆర్డీవోకు వినతి

చిలుపూర్, జూన్ 21: సీలింగ్ భూముల సమస్యపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని శ్రీపతిపల్లికి చెందిన బాధితులు స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్నకు వినతిపత్రాన్నందజేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు రంగు రమేష్, మాలోతు రాజునాయక్, గ్రామాధ్యక్షుడు పోలబోయిన నరేష్ నేతృత్వంలో బాధిత రైతులు చేర్యాల పోశయ్య, నీల చిన్న వెంకటయ్య, సాయమ్మ, కనకమ్మ తదితరులు ఆర్డీవోను కలిసి వారి సమస్యను విన్నవించారు. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న తమ పరిస్థితిని అదునుగా భావించిన సమీప రైతులు రాజకీయ నాయకుల అండదండలతో తమ భూములను అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మోతె మహేశ్, పల్లపు కనకయ్య, మోతె ఉపేందర్, రొడ్డ సాంబయ్య, మోతె రజనీకాంత్, టేకులపల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల బాలయేసు పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



బతుకమ్మకుంటలో యోగాసనాలు వేస్తున్న పట్టణవాసులు



జనగామలో శోభాయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘనంగా యోగా దినోత్సవం

జనగామ కల్చరల్, జూన్ 21: జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కలువల శ్రీనివాస్ అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ కళ్యాణి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు పాల్గొన్నారు. బతుకమ్మకుంట మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షకులు గీతేష్ బజాజ్ నేతృత్వంలో భజరంగ్ యోగా సంస్థాన్ పిలుపు మేరకు యోగా దినోత్సవం నిర్వహించారు. అనంతరం బతుకమ్మ కుంట నుంచి ఆర్టీసీ చౌరస్తా మీదుగా నెహ్రూ పార్కు వరకు శోభాయాత్ర నిర్వహించారు. వివేకానందసేవా సమితి ఆధ్వర్యంలో జనగామ పట్టణం లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఏకశిల పబ్లిక్ స్కూల్లో, శ్రీ అరబిందో ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ యోగా దినోత్సవంలో పాల్గొని దాని ప్రాముఖ్యత వివరించారు. వేద ఆయుర్వేదిక్ పంచకర్మ వెల్‌నెస్ సెంటర్ ఆసుపత్రి డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మెడ, నడుము, కీళ్లనొప్పులు, చర్మ సంబంధిత, సైనస్ మొదలగు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనగామ మండలం యశ్వంతాపురం లోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ) లో యోగా డే నిర్వహించారు. ఈషా ఫౌండేషన్ ప్రతినిధులు జ్యోతి, శ్రీ ప్రియ, అనిల్, జలజ పాల్గొని యోగా వలన కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులను కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 500 మంది విద్యార్థులతో పాటు బీరెడ్డి స్వప్న, ఆనంద్ రెడ్డి, కాసాల సంతోష్‌కుమార్, నాగరాజు, సంతోష్ యాదవ్‌పాల్గొన్నారు.

బాలయేసులో ఘనంగా యోగా దినోత్సవం

దేవరుప్పుల: మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాలలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ మాస్టర్ క్రిష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు రకాల యోగాసనాలు వేశారు. కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఖాజా, మదన్‌మోహన్, మహేష్, పాషా విజయలక్ష్మి, మాధవి, అనిత పాల్గొన్నారు.

తరిగొప్పుల: బీజేపీ మండలాధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు యోగా కార్యక్రమంలో పాల్గొని తమ ఆసనాలతో పలువురిని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో దమ్మన్నగారి మాదవ రెడ్డి, పబ్బోజు రాం బ్రహ్మచారి, తలకొక్కుల శ్రీనివాస్, కొన్నె రాజు, జంగ వీరకుమార్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్ఎస్ఎస్ పీటీ, యోగా ట్రైనర్ డాక్టర్ మహేందర్ నేతృత్వంలో బాలబాలికలు అబ్బురపరిచేలా యోగాసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ జానీనాయక్, ఉపాధ్యాయులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు గాదెపాక శ్వేత ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమాలు నిర్వహించారు.

రఘునాథపల్లి: మండలంలోని మంగలిబండ పరిధిలో గల కోయల్‌గడ్ క్షేత్రంలోని జగదంబ మాతా సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబు నాయక్ యోగా ధ్యానం చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ నాయక్, గురువు రమేష్ మహారాజ్, రఘురాం రాథోడ్, రేఖ్యా నాయక్, బానోత్ మహేందర్, భూక్యా రాజు, అనిల్ చౌహన్, బానోత్ అశోక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు అందనీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం సంపత్, ఉపాధ్యాయులు బి.శ్రీకాంత్, రవికుమార్, డి.సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శివునిపల్లి హైస్కూల్, ఘన్‌పూర్ పీఎస్, శివునిపల్లి యూపీఎస్‌తో పాటు అన్ని పాఠశాలల్లో యోగా డే నిర్వహించారు.

పాలకుర్తి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట మైదానంలో యువకులు పాల్గొని యోగాసనాలు చేశారు. అయ్యంగారిపల్లికి చెందిన పెండ్లి రాజు అనే మాస్టర్ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, జిల్లా నాయకుడు కమ్మగాని శ్రీకాంత్, బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్, పట్టణ అధ్యక్షుడు సంతోష్, నిరంజన్‌రెడ్డి, పెనుగొండ సోమేశ్వర్ ఉన్నారు.

నర్మెట: యోగా కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొన్నె రాజు, ముదిగొండ ప్రభాకర్, రవి, రమేష్ పాల్గొన్నారు.

చిలుపూర్: యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని మల్కాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కుషాలి అన్నారు. శుక్రవారం ఆయన మల్కాపూర్, రాజవరం, నష్కల్, కృష్ణాజీగూడెం, పల్లగుట్ట తదితర గ్రామాల్లో సిబ్బందితో పాటు, విద్యార్థులు, జీపీ సిబ్బందితో కలిసి యోగాసనాలు చేయించారు. ప్రతీఒక్కరూ నిత్యం యోగా చేయడాన్ని అలవాటు చేసుకుని ఆరోగ్యకరమైన జవనం సాగించాలని సూచించారు.

బచ్చన్నపేట: బచ్చన్నపేటలో అచల ఫౌండేషన్, సీఎస్‌సీ సెంటర్‌ల అధ్వర్యంలో కస్తూర్బా విద్యాలయంలో వీఎస్ఆర్ నగర్‌లో సీఎస్‌సీ నిర్వాహకురాలు కోనేటి వాణిశ్రీ అధ్వర్యంలో అంతర్జాతీయ యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, యువతకు యోగాపై అవగాహన కల్పించారు. మానసిక ప్రశాంతతకు ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగా చేయడం అవసరమన్నారు.



శ్రీఅరబిందో పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పాలకుర్తిలో యోగా చేస్తున్న బీజేపీ నాయకులు



రఘునాథపల్లిలో ధ్యానం చేస్తున్న అంగోతు రాంబాబు తదితరులు



స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు



బచ్చన్నపేటలో అచలా ఫౌండేషన్ అధ్వర్యంలో యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం



లింగాలఘణపురం కేజీబీవీలో అక్షరమాల రూపంలో విద్యార్థుల యోగాసనాలు



నర్మెటలో యోగా చేస్తున్న బీజేపీ నాయకులు



జఫర్‌గడ్‌లోని ఆదర్శ పాఠశాల, కళాశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వాల్సిందే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



గుడిసెవాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

బచ్చన్నపేట, జూన్ 21: చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారులోని గోపాల్‌నగర్ వద్ద ఇళ్ల స్థలాల కోసం నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని, ప్రభుత్వం వారికి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గోపాల్‌నగర్ వద్ద గల 174 సర్వే నెంబరులో గుడిసెలు వేసిన స్థలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలు కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాలకోసం పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. సీపీఎం అధ్వర్యంలో పేదల ఇళ్ల స్థలాలకోసం సాగుతున్న ఉద్యమాలను గుర్తించి ప్రభుత్వం తక్షణం పట్టాలివ్వాలన్నారు. సీపీఎం అధ్వర్యంలో అనేకమంది నిరుపేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇప్పించామన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి ఇళ్ల పట్టాలు వచ్చేలా ఒప్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా నాయకులు బూడిద గోపి, సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేశ్, పర్వతం నర్సింహులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా కమిటీలో భిక్షపతికి చోటు

కొడకండ్ల జూన్ 21 : మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు ధర్మారపు భిక్షపతి జిల్లా కాంగ్రెస్ కమిటీలో కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

లింగాలఘణపురం, జూన్21: నెలల తరబడిగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ లింగాలఘణపురం మండలానికి చెందిన గ్రామపంచాయతీ ఉద్యోగులు సూపరింటెండెంట్ సీతారాంనాయుడుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు తిప్పారపు యాకూబ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 51ని సవరణ చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని కోరారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలను చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం మండల ఉపాధ్యక్షులు ఇట్టబోయిన మహేందర్, కాటిక పరుశరాములు, యాదగిరి, నర్సింహులు, సునీల్, అనిల్, నర్సయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీపై స్లాబ్ వేయాలని..

లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్లలో ఎస్సీకాలనీ ప్రాంతంలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీపై వెంటనే స్లాబ్ వేయాలని స్థానికులు గ్రామపంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీపై స్లాబ్ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్రం బాలరాజ్, బత్తిని అశోక్, ఎనగందుల బాస్కర్, నర్సింగ రమేశ్, దామెర నాగరాజు, కామిని భరత్, నల్ల అజయ్, బొజ్జం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

నర్మెట, జూన్ 21 : మండలంలోని అమ్మాపురం గ్రామంలోని తురకవారికుంటలో అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కుంట పక్కన ఉన్న రైతులు శుక్రవారం తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. మట్టి తరలించడంతో కుంట కింద ఉన్న రైతులకు పంట నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, దయాకర్‌రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీలు రికార్డులు నిర్వహించాలి: ఈఈ

బచ్చన్నపేట, జూన్ 21: మండలంలోని అన్ని గ్రామా పంచాయతీలు మిషన్ భగీరథకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆయన కొడవటూరు గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ట్యాంకుల్లో క్లోరినేషన్ నీటి పరీక్షలు నిర్వహించడం, బ్లీచింగ్ పౌడర్ తెప్పించి నీటి నిల్వ ప్రదేశాలను గుర్తించి, చల్లించడం, పైపు లీకేజిలను సరిచేయడం, గ్రామంలో అందరికి నీళ్లు వచ్చేలా చూడడం తదితర విషయాలను నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత



విద్యార్థులకు క్రీడా దుస్తులను అందిస్తున్న చింతల యాదయ్య

నర్మెట, జూన్ 21 : మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంఎస్ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చింతల యాదయ్య శుక్రవారం క్రీడా దుస్తులను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా 100 మందికి స్పోర్ట్స్ డ్రెస్సులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు ఇట్టబోయిన రాజు, పండుగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు




గాయపడిన బూర్ల రాజు, రవి కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 21: మండలంలోని ఛాగల్ గ్రామంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన బదావత్ రవికుమార్ తన బైక్‌పై హైదరాబాద్ నుంచి చౌటపల్లి గ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పి ఛాగల్ గ్రామంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న బూర్ల రాజును ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని ఇద్దరిని 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

108 ఉద్యోగులకు డీఎంహెచ్‌వో అభినందన



ఉద్యోగులకు ప్రశంసా పత్రం అందిస్తున్న డీఎంహెచ్‌వో

జనగామ రూరల్ జూన్ 21: ఉత్తమ సేవలు అందించిన 108 వాహన ఉద్యోగులను జిల్లా వైద్యశాఖ అధికారి హరీష్ రాజ్ అభినందించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో జనగామ నియోనాటల్ ఈఎంటీ శాగ రాంబాబు, రఘనాథపల్లి ఈఎంటీ మోహన్‌లను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాధితులను ఆస్పత్రికి తరలిస్తూ అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేసి వారి ప్రాణాలను కాపాడడంలో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ ప్రాజెక్ట్ మేనేజర్ నజీరుద్దీన్, జిల్లా మేనేజర్ మంద శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ కావ్యను కలిసిన పలు సంఘాల నాయకులు



ఎంపీ కావ్యను సన్మానిస్తున్న జఫర్‌గడ్ ఆర్యవైశ్యులు

జఫర్‌గడ్, జూన్ 21: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్యను శుక్రవారం జఫర్‌గడ్ మండల ఆర్యవైశ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. హన్మకొండలోని వారి నివాసంలో కలిసి సన్మానించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు షిఫ్ట్ అయిన బ్యాంకు ఆఫ్ బరోడాను తిరిగి జఫర్‌గడ్‌లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, పేద ఆర్యవైశ్య కుటుంబాలకు ష్యూరిటీ లేకుండా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్టిమళ్ల కృష్ణమూర్తి, రేవూరి రమేశ్, బోనగిరి శ్రవణ్ కుమార్, అంచూరి యుగంధర్, రేవూరి శ్రీనివాస్, బజ్జూరి మణికాంత్, సంతోష్‌కుమార్, దొడ్డ రమేశ్, దాంశెట్టి రామన్న, అంచూరి శ్రీనివాస్, పాలకుర్తి రాజన్న, బెలిదె హరిశంకర్, మురళి, సోమన్న, వెంకన్న పాల్గొన్నారు.

ఘన్‌పూర్ నాయీబ్రాహ్మణులు

స్టేషన్‌ఘన్‌పూర్: వరంగల్ ఎంపీ కడియం కావ్యను, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్ మండల నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కొలిపాక సతీష్, వేణు, సతీష్, ఐలయ్య, శంకర్, రాజయ్య, రమేష్, రాము, రంజిత్, వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేసిన కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి: కడియం శ్రీహరితో పాటు వరంగల్ ఎంపీ కడియం కావ్యను హన్మకొండలోని వారి స్వగృహంలో రఘునాథపల్లికి చెందిన బొనాసి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మండేలగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలకు బదులుగా వినూత్న రీతిలో పేద విద్యార్థుల కోసమని 300 నోట్ బుక్స్‌ను కడియం శ్రీహరికి అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో డ్యాగల రాజశేఖర్, వేణు, నాగభూషణం, రఘుపతి, పెద్దోళ్ల నర్సింగం, గణేష్, వెంకటేష్, ముప్పిడి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: కేజీబీవీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను రాజవరంనకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మారెపల్లి శ్యామ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక నాయకులతో పాటు హన్మకొండలోని ఆమె నివాసంలో కలిసి ప్రహరీ, టాయ్‌లెట్లు, గదుల నిర్మాణం, తాగునీటి వసతి తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందించి త్వరలోనే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల (కర్ణాల) యాదగిరి, నల్ల ఎల్లయ్య, ఎడ్ల శ్రీనివాస్, నల్ల లింగయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ

చిలుపూర్, జూన్ 21 : చిలుపూర్ ఎస్సీకాలనీలో అనారోగ్యంతో మృతిచెందిన రాజారపు యాదమ్మ (75) కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే టి.రాజయ్య శుక్రవారం సందర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఇల్లందుల వెంకటస్వామి, కలకోట రజినికుమార్, ప్రవీన్, నలిమెల కుమార్ ఉన్నారు.